# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ నిర్మాణంలో నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సిసి) ఎంతో కృషి చేస్తోందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రశంసించారు.
- ❖ పౌరసత్వాన్ని ధృవీకరించే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.
- ❖ ప్రవాస భారతీయులు మరింత చేరువయ్యేలా వినూత్న ఎన్నారై డిపాజిట్ ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులను కోరారు.
- ❖ లార్డ్స్ వేదికగా ఏకైక టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో భారత మహిళా జట్టు 270 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ పై ఘన విజయం సాధించింది.

=====================

దేశ నిర్మాణంలో నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సిసి) ఎంతో కృషి చేస్తోందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రశంసించారు. రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఉపరాష్ట్రపతి భవన్‌లో ఈరోజు సి.పి. రాధాకృష్ణన్ ను కలిసి ఎన్‌సీసీ, సైనిక్ పాఠశాలల గురించి వివరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్, స్వచ్ఛ భారత్ అభియాన్‌తో సహా ఎన్‌సిసి చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా కొనియాడారు. ఎన్‌సిసి పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటును కూడా ఉపరాష్ట్రపతి స్వాగతించారు. దీనిని బలోపేతం చేయడం ఒక ఉమ్మడి జాతీయ బాధ్యత అని ఉపరాష్ట్రపతి స్పష్టం చేస్తూ... మౌలిక సదుపాయాల అభివృద్ధిని మరింతగా పెంచాలని, శిక్షణా మౌలిక సదుపాయాల వంటి విషయాలపై రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయాన్ని మెరుగుపరచాలని సూచించారు. `ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్` కింద చేపట్టిన క్యాడెట్ మార్పిడి కార్యక్రమం జాతీయ సమైక్యతను బలోపేతం చేయడానికి ఒక అద్భుతమైన కార్యక్రమం అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

=====================

పౌరసత్వాన్ని ధృవీకరించే ప్రక్రియ, అలాగే ఒకరిని విదేశీయుడిగా గుర్తించే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అసోంలో విదేశీయులుగా ముద్రపడిన 27 మంది పౌరులకు రక్షణ కల్పిస్తూ.. సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పౌరసత్వం, విదేశీ హోదా అనేవి రాజ్యాంగపరంగా, చట్టబద్ధంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశాలని పేర్కొంది. అదే సమయంలో వ్యక్తులు చట్టవిరుద్ధంగా పౌరసత్వాన్ని పొందకుండా నిరోధించే అధికారం భారత ప్రభుత్వానికి ఉందని వెల్లడించింది. మొత్తంగా న్యాయపరమైన ప్రక్రియదే పైచేయి అని స్పష్టం చేసింది. అలాగే గువాహటి హైకోర్టు ట్రిబ్యునళ్ల ఉత్తర్వులను రద్దు చేసింది. పాత ఓటర్ల జాబితాలో సాంకేతిక కారణాలు, చిన్నపాటి వ్యత్యాసాల ఆధారంగా తమను విదేశీయులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ అసోంకు చెందిన 27 మంది సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానంలో వారికి ఊరట లభించింది. అయితే వారి పౌరసత్వాన్ని ధృవీకరించే ఆధారాలను తాము పరిశీలించలేదని ఈ సందర్భంగా ధర్మాసనం వెల్లడించింది. ట్రిబ్యునళ్లు మరోసారి విచారణ జరిపే వరకు వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు ఉండకూడదని ఆదేశాలు ఇచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ అభివృద్ధి, సమృద్ధికి లక్నో-కాన్పూర్ ఎక్స్‌ప్రెస్‌వే కొత్త మార్గాలను సృష్టిస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తో కలసి లక్నో-కాన్పూర్ ఎక్స్‌ప్రెస్‌వేను రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్నోలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ...

(వాయిస్ 25 సెకన్లు)

63 కిలోమీటర్ల పొడవు, ఆరు వరుసల గల ఈ ఎక్స్‌ప్రెస్‌వే భారతదేశంలో రెండవ అతి పొడవైన ఎలివేటెడ్ కారిడార్‌ను కలిగి ఉంది. అంతేకాకుండా, ఆటోమేటెడ్, ఇంటెలిజెంట్ మెషిన్-గైడెడ్ నిర్మాణ సాంకేతికతను ఉపయోగించి నిర్మించిన మొట్టమొదటి ఎక్స్‌ప్రెస్‌వే ఇది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రవాస భారతీయులు మరింత చేరువయ్యేలా వినూత్న ఎన్నారై డిపాజిట్ ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి శాఖ నిర్మలా సీతారామన్ ప్రభుత్వ రంగ బ్యాంకులకు పిలుపునిచ్చారు. విదేశీ కరెన్సీ ప్రవాస భారతీయుల బ్యాంక్ డిపాజిట్లు, విదేశీ కరెన్సీ రుణాల మార్పిడి (స్వాప్) కార్యక్రమాలపై ఈరోజు న్యూఢిల్లీలో బ్యాంకులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో నిర్మలా సీతారామన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సమీకరణ వేగాన్ని కొనసాగించడానికి ఎన్నారైలతో మరింత విస్తృతంగా సంబంధాలు పెంచుకోవాలని స్పష్టం చేశారు. బ్యాంకులు, ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల ఎండీలు, సీఈఓలు ఆర్‌బిఐ స్వాప్ సౌకర్య పథకాల కింద సాధించిన పురోగతిని కేంద్రమంత్రికి వివరించారు. విదేశీ మారక ద్రవ్య ప్రవాహాలను సమీకరించడంలో స్వాప్ సౌకర్యాల సమర్థతను బ్యాంకులు, ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల భాగస్వామ్యం బలపరుస్తుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-జపాన్ దేశాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నాయని ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి. జపాన్‌లోని టోక్యో నగరంలో జరిగిన 8వ రక్షణ విధాన చర్చల సందర్భంగా.. ఇరు దేశాలు ప్రస్తుత ప్రాంతీయ, ప్రపంచ భద్రతా పరిస్థితిపై సమగ్ర చర్చలు జరిపి, పరస్పర ఆసక్తి ఉన్న అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నాయి. భారత ప్రతినిధి బృందానికి రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ నాయకత్వం వహించగా, జపాన్ ప్రతినిధి బృందానికి అంతర్జాతీయ వ్యవహారాల రక్షణ శాఖ ఉపమంత్రి కానో కోజి నాయకత్వం వహించారు. ఈ చర్చల సందర్భంగా.. గత రక్షణ విధాన చర్చల నుండి ద్వైపాక్షిక రక్షణ సహకారంలో సాధించిన గణనీయమైన పురోగతిని ఇరుపక్షాలు సమీక్షించుకున్నాయి. రక్షణ పారిశ్రామిక సహకారం, సాంకేతిక

ఆవిష్కరణ, సైబర్ భద్రత, అంతరిక్షం, ఉమ్మడి వ్యూహాత్మక ఆసక్తి ఉన్న ఇతర రంగాలతో సహా అభివృద్ధి చెందుతున్న రంగాలలో సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ఇరుపక్షాలు చర్చించాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూజిలాండ్ మంత్రి మార్క్ ప్యాటర్సన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ఈరోజు కలిసింది. బలమైన పార్లమెంటరీ సహకారానికి భారత్-న్యూజిలాండ్ మధ్య ఉన్న చిరకాల సంబంధాలను మరింత పెంపొందించుకోవడం వంటి అంశాల ప్రాముఖ్యతను ఈ సమావేశం స్పష్టం చేసిందని ఓం బిర్లా సామాజిక మాధ్యమం పోస్ట్‌లో తెలిపారు. పార్లమెంట్ హౌస్ సందర్శన సందర్భంగా.. భారతదేశపు చైతన్యవంతమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, గొప్ప ప్రజాస్వామ్య సంప్రదాయాలు, వాస్తు వైభవాన్ని ప్రతినిధి బృందానికి పరిచయం చేశారని ఓం బిర్లా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంగ్లాండ్ లోని లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళా జట్టు విజయం సాధించి చరిత్ర సృష్టించింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. భారత్ నిర్దేశించిన 457 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 170 పరుగులకే ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా 341 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. 134 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో 4వ రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ భారత బౌలర్ల దాటికి మరో 52 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలీ, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ రెండేసి వికెట్లు చొప్పున తీసి ఇంగ్లాండ్‌ను తక్కువ పరుగులకే ఆలౌట్ చేసి సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ ఫిజిక్స్ ఒలింపియాడ్ -2026లో స్వర్ణ పతకాలు సాధించిన భారత బృందాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంశించారు.  ఈ విజయం అపరిమితమైన యువశక్తి సామర్థ్యానికి, సైన్స్, పరిశోధన పట్ల వారికున్న అభిరుచికి మరో ఉదాహరణ అని అన్నారు. గత దశాబ్ద కాలంగా ఒలింపియాడ్ వివిధ ఎడిషన్లలో భారత విద్యార్థులు నిలకడగా అత్యుత్తమ ప్రతిభ కనబరచడం కూడా అంతే ప్రశంసనీయమని ప్రధానమంత్రి అన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కొలంబియాలోని బుకారమంగాలో జరిగిన 56వ అంతర్జాతీయ భౌతిక శాస్త్ర ఒలింపియాడ్ (IPhO) 2026లో ఐదుగురు భారతీయ విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు అతిపెద్ద ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉత్సవమైన `భారత్ టెక్స్-2026` రేపు న్యూఢిల్లీలోని భారత మండపంలో ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవం వస్త్ర పరిశ్రమ, ఫ్యాషన్, సుస్థిరత, సాంకేతికత, ఆవిష్కరణ, పెట్టుబడి, అంతర్జాతీయ వాణిజ్యం వంటి రంగాలలో భారత్ కు పెరుగుతున్న ప్రపంచ స్థాయి నాయకత్వాన్ని ప్రదర్శించనుంది. ఈ కార్యక్రమంలో తయారీదారులు, ఎగుమతిదారులు, ప్రపంచవ్యాప్త కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు, అంతర్జాతీయ ప్రతినిధి బృందాలు, కళాకారులు, స్టార్టప్‌లు, సాంకేతిక ప్రదాతలు ఒకచోట చేరతారు. దీనిపై న్యూఢిల్లీలో జరిగిన ఒక పత్రికా సమావేశంలో భారత్ టెక్స్ ట్రేడ్ ఫెడరేషన్ ఛైర్మన్ నరేన్ గోయెంకా మాట్లాడుతూ.. భారత్ టెక్స్ మూడవ ఎడిషన్‌లో 7 వేల మందికి పైగా కొనుగోలుదారులు, లక్షా 30 వేలకు పైగా వాణిజ్య సందర్శకులు, 20 వేలకు పైగా వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శించే ఎగ్జిబిటర్లు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

======================

అసోం, మేఘాలయ, బీహార్, గంగా పరీవాహక పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో ఈరోజు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. రానున్న రెండు మూడు రోజుల్లో ఈశాన్య, తూర్పు ఉత్తర ప్రదేశ్, ఒడిశా, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఇదిలా ఉండగా, కోస్తాంధ్ర ప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల్లో రేపు వడగాలులు వీచే అవకాశం ఉందని, ఒడిశా, తమిళనాడు పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాల్లో రేపటి వరకు వేడిగాలులు, తేమతో కూడిన వాతావరణం ఉంటుందని ఐఎండీ వెల్లడించింది.

======================

======================